# ఆదర్శం అంతరించింది ★

★

రచన :
రాజా వెంకట శకుంతల

"ఏమండీ?"

"....................."

"మిమ్మల్నేనండీ?"

"ఏమిటి?"

"ఏమిటా! కోమటి కొత్తబెల్లం."

"అబ్బ! చెప్పేదేమిటో త్వరగా చెపుదూ. నేను కాలేజీ మీటింగ్‌కి వెళ్ళాలి."

"మొన్న నేను మీనాక్షివాళ్ళింటికి పేరంటానికి వెళ్ళాను......"

"వెళ్ళితే?"

"చెప్పనివ్వండి మరి! మీనాక్షి చెల్లెలికి సూడిదచేసిందిలెండి. పిలిస్తే పేరంటానికి వెళ్ళాను. ఆరోజు పేరంటంలో మీనాక్షి కట్టుకున్న కంచి పట్టుచీర యెంత బాగున్నదనుకున్నారూ! గులాబీరంగుచీర, నల్లని కొండలంచు, ఎర్రని పైటకొంగు"

"అయితే యింతకీ ఏమంటావ్?" అన్నాడు సుబ్రహ్మణ్యం మధ్యలో అడ్డువచ్చి.

"మీరిన్నాళ్లనుండి లెక్చరర్ పని చేస్తున్నారు. నాకెప్పుడైనా అలాంటి చీర కొనిపెట్టారూ? అంతవరకూ దేనికి, ఏభై రూపాయలు పెట్టి ఒక మంచి గుంటూరు నేతచీరన్నా కొనిపెట్టారూ! మీనాక్షి మొగుడు చూడండి. అతను వచ్చినప్పు డెలావున్నాడూ, ఇప్పు డెలా వున్నాడూ? అంతా దాని యిష్టము. కోరిన నగ, వీరిన చీర" అన్నది శారద చేతులు కుర్చీమీద ఆనించి.

రోజూవున్నదే గాబట్టి అతను తాపీగానే వున్నాడు.

నవ్వుతూ 'ఊఁ...ఇంకా' అన్నాడు.

శారద యింకా చెప్పుతూనేవున్నది. "మొన్న ఆరువందల రూపాయలుపెట్టి మంచి బుష్‌రేడియో కొన్నాట్ట వాళ్ళాయన. మొన్న పేరంటమప్పుడు ఆరేడియో పెడితే అందరూ వింతగా చూచే వాళ్ళే! అందరూ మీనాక్షిని అనబెట్టే వాళ్ళే. నాకు నిజంగా తల తీసివేసినట్లయింది. వాళ్లచెల్లికి ఎంత మంచి చీర కొన్నదనుకున్నారూ! కనీసం 150 రూపాయలన్నా వుంటుంది ఖరీదు. రకరకాల మిఠాయిలూ, పళ్ళూ పంచిపెట్టింది వచ్చినవారందరికీ." కాసేపు ఆగింది.

"అయిందా వుపన్యాసం" అన్నాడు సుబ్రహ్మణ్యం డ్రాయరు తెరుస్తూ.

"మీకలాగేవుంటుందిలెండి. మీతోటి లెక్చరర్ మీకన్నగొప్పగావుండి ఆయన పెళ్ళాన్ని అందరూ మహారాణీలాగా గౌరవిస్తూ, మీ భార్యని పలుకరించే వారే లేక నలుగురూ చిన్న చూపు చూస్తుంటే మీకు నామర్దా కాదుటండీ" అన్నది రోషంగా శారద.

"అవును నేనుకూడ శర్మకి మల్లే అడిగిన ప్రతి చవటవెధవకీ ట్యూషన్లు చెపుతూ, వాడి తల్లితండ్రులకి సలాంలుచేస్తూ, యూనివర్సిటీ ఎగ్జామినేషన్స్‌లో డబ్బు తీసుకుని మార్కులు వేస్తుంటే, నువ్వూ ఒక చక్రవర్తినిలాగ వుంటావు" అన్నాడు సుబ్రహ్మణ్యం విసురుగా కుర్చీలోనుండి లేస్తూ.

శారదకూడ విసురుగానే అన్నది "అందులో తప్పేముంది. నాలుగు మార్కులువేస్తే ఎంత డబ్బయినా యిస్తామని మన పడిపంచల పడుండే వాళ్ళకి ఆమాత్రం సహాయంచేయడం తప్పంటారా? ఇప్పుడా శర్మ మార్కులేసి డబ్బు తీసుకుంటున్నాడని యెవరైనా అనుకుంటున్నారా? ఆయన భార్య కట్టుకున్న కంచి పట్టుచీరనీ, ఆయనకొన్న బుష్ రేడియోని చూచి అందరూ అనబెట్టేవాళ్ళే గానీ; నన్ను చూచి యీవిడభర్త సత్య సంధుడు ఎవరిడబ్బూ కానీ ముట్టుకోడని ఎవరన్నా అనుకుంటున్నారా? ఇంకా పైగా నన్నుచూచి 'అదేమిటమ్మా! నువ్వుకూడ మీనాక్షి చీరలాంటి చీర కొనుక్కోలా?' అని ఒకరూ, 'మీరుకూడా రేడియో కొనుక్కోబోయారూ?' అని మరొకరు ముఖాన పట్టుకుని అడగడం, వాళ్ళలా అంటుంటె నేను తలెత్తుకోలేకపోయినాను. మీ కెంతసేపటికీ మీ ఆదర్శాల సంగతేగాని, ఇరుగుపొరుగుల్లో నేనెంత లోకువగా వున్నానో గ్రహించడంలేదు."

"శారదా! నీవెన్నయినాచెప్పు. నేను మాత్రం అటువంటిపని నా జన్మలో చేయను చేయలేను. వెధవ డబ్బుకోసం మన ఆత్మగౌరవాన్ని చంపుకుంటామా? ప్రతివాడికీ అడిగినన్నిమార్కులు వేసి, ఇచ్చినంత డబ్బు తీసుకుని మనం కులుకుతూ వుంటాము. కాని రేపు వాడు డబ్బుతో కొనుక్కున్న డిగ్రీలతో, మెదడులేని తలకాయతో దేశానికి కలిగించే హాని ఎంతో తెలుసుకున్నావా? మన సుఖంకోసం, మన బాగుకోసం దేశానికి ద్రోహంచేయమంటావా? ఏం! మనకన్నా తక్కువవాళ్లని చూచి మనం గర్వపడాలి. కాని ఆ శర్మలా ఆత్మగౌరవాన్ని మంటగలుపుకుని బాహ్యగౌరవంకోసం ప్రాకులాడటం నా పాలసీకాదు.


"మీ రాత్మగౌరవం, ఆత్మగౌరవం అంటారు గాని, ఇరుగుపొరుగువారికి మనమీద గౌరవం లేకపోయినప్పుడూ

మనల్ని తక్కువగా చూస్తున్నపుడు, మనమీద మనకిమాత్రం గౌరవం వుంటుందా? వచ్చినక్రొత్తల్లో మీనాక్షి మనింటికి ఎప్పుడూ వచ్చేది. అటువంటి దిప్పుడు మనింటికి రాకపోగా, వాళ్ళింటికెడితే, అదోమాదిరిగా మాట్లాడుతుంది. అటువంటప్పుడు నా స్థితి చూచుకుంటే నామీద నాకే గౌరవం తగ్గిపోతున్నది" అన్నది శారద ఎర్రబడ్డ కళ్ళతో.

"అయితే యింతకీ నన్ను కూడ ట్యూషన్లుచెప్పి మార్కులువేసి డబ్బు సంపాదించమంటావ్. అది మాత్రం నేనుచేయను. ముమ్మాటికీ చేయను" అని విసురుగా ముందుకి రెండడుగులు వేసాడు సుబ్రహ్మణ్యం.

"ఇంతకీ నాఖర్మలెండి! దానికి మిమ్మల్ననవలసిన పనిలేదు" అని చురచురాచూస్తూ, చరచరా రెండడుగులు లోపలికివేసింది శారద. ఇంతలో వీధిముందు జట్కా ఆగడం చూచి యిద్దరూ ఆగిపోయారు.

ఆ బండిలోనుండి ఆమె పినతండ్రి అప్పారావుగారూ, ఆయనవెంట ఒక అపరిచితుడైన యువకుడూ బండి దిగి లోనికివచ్చారు. నాలుగు సంవత్సరాలకి సెలవుగావచ్చిన పినతండ్రినిచూడగానే శారదకళ్ళు ఆనందంతో మెరిసాయి. పినమామగారిని చూడగానే సుబ్రహ్మణ్యం గబగబా ఎదురుబోయి చేతిలో సంచీ అందుకుని సగౌరవంగా లోనికి తీసికొచ్చాడు. ఇంతలో శారద రెండుచెంబులతో నీళ్ళుతెచ్చి ఇద్దరికీ యిచ్చింది కాళ్ళుకడుక్కోమని. రాక రాక చాలా కాలానికి వచ్చినందుకు ఒక అరగంటవరకు పరస్పరం కుశల ప్రశ్నలతోనే గడిచిపోయింది. అందరు భోజనాలు చేసారు. అప్పారావుగారు సుబ్రహ్మణ్యాన్ని చాటుకిపిలిచిచెప్పారు "నాతోవచ్చిన కుర్రవాడి పేరు మల్లికార్జునరావు. మావూళ్ళో ప్లీడర్ లింగారావుగారబ్బాయి. మొన్న బి.ఏ. పరీక్షకి కూర్చున్నాడు. అన్నీ బాగానే వ్రాశాట్ట. ఇంగ్లీషులోమాత్రం కొంచెం 'డౌట్'గా వుందట. లింగారావుగారికి నేను ఏమంత పరిచయం లేకపోయినప్పటికీ నన్ను పిలిపించి "మీబంధువు లాయన దగ్గరికెళ్ళాయట పేపర్లు. కొంచెం చెప్పి సహాయం చేయించా"లని మరీ మరీ బ్రతిమిలాడి చెప్పాడు. తర్వాత కనుక్కుంటే నీదగ్గరకే వచ్చాయని చెప్పారు. నువ్వు నాలుగు మార్కులు add చెయ్యాలి."



సుబ్రహ్మణ్యం ముఖం కందగడ్డలా అయింది. "మార్కులా మామగారూ, మీరేమీ అనుకోవద్దు. మీ రిది తప్ప యింకేదిచెప్పినా చేస్తాను" అన్నాడు ముక్తసరిగా. అప్పారావుగారి ముఖం దమ్మిడీఅంత అయింది. లేని చిరునవ్వు తెచ్చుకుని "అదేమిటోయ్! నువ్వలాఅంటే ఎలా? నువ్వేమాత్రం సహాయం చేసావంటే వాళ్ళెంత డబ్బయినా సరే యిచ్చేందుకు సిద్ధంగావున్నారు. నువ్వు కాదనకుండా చెయ్యాలీపని"అన్నారు బుజంమీదచెయ్యివేసి.

డబ్బు అనేసరికి సుబ్రహ్మణ్యం దెబ్బతిన్న లేడిలా వులిక్కిపడ్డాడు. తమాయించుకుని అన్నాడు, "మీరు పొరపడుతున్నారు. నేను అలా డబ్బు తీసుకొని మార్కులువేసేవాణ్ణి కాదు. ఇంకా వూరికే చెయ్యమన్నా చేస్తాగానీ! అయినా సొంత తెలివితేటలు లేనివాళ్ళు యిలా డబ్బుతో ప్యాసై దేశాని కేమి మేలుచేస్తారు? నేనిప్పుడు దయతలచి మార్కులు వేస్తాననుకోండి. అది పరోక్షంగా దేశానికి ద్రోహం చెయ్యడమే అవుతుందికదా! ఇది మీకు తెలియని విషయంగాదు. మీరు మరో విధంగా అనుకోవద్దు. ఇదితప్ప ఇంకేమి చెయ్యమన్నా చేస్తాను. క్షమించండి." మామగారి రెండు చేతులూ పట్టుకున్నాడు. అప్పారావుగా రింకేమీ మాట్లాడలేక పోయాడు. అల్లుడి కిటువంటి వుదాత్తమైన భావాలున్నయ్యిగదా అని లోలోన సంతోషించినా, మొత్తానికి తనకు

మాత్రం ఎగనామం పెట్టాడుకదా అని కొంచెం కించపడ్డారు. అందుకనే కూతురిని చాటుకుపిలిచి చెప్పారు.

"అమ్మాయీ! నువ్వయినా కాస్త చెప్పమ్మా వింటాడేమో! పాపమాయన కొండంత ఆశబెట్టుకుని పంపించాడు. నేనుకూడ వచ్చినపని అవుతుందనే కొండంత ఆశపెట్టుకుని వచ్చాను. ఇతనేమో ఇలా అంటున్నాడు" అన్నారు.

శారద భర్తతోఅంది. "ఆయన పెద్దవాడు. రాకరాక మనింటి కొచ్చాడు. అలా బ్రతిమిలాడుతూంటే మీరు ఇలా మంకుపట్టు పట్టుక్కూర్చుంటే యేమన్నా బాగుందా? ఆయన పట్టప్పుడు మనింటికిరమ్మన్నా వస్తాడా? నామాట వినండి కాదనకండి" అని బ్రతిమిలాడి చెప్పింది. కాని సుబ్రహ్మణ్యం వినలేదు. ఆ సాయంత్రం బండికే అప్పారావుగారు వూరికెళ్ళిపోయాడు. కూడా వచ్చిన కుర్రవాడు నిరాశతో 'ఇంతేనా' అన్నట్లుగా చూచాడు.

వాళ్ళు వెళ్ళిన తరువాత సుబ్రహ్మణ్యానికి, శారదకీ కొంత పోట్లాట జరిగింది. "మా చిన్నాయన రాకరాక మనింటికొచ్చి యీ చిన్న వుపకారం చేయమని బ్రతిమిలాడుతే కాదన్నారు. రేపు నేనక్కడకే మొగంపెట్టుకెళ్లను. ఇదే మీవాళ్లయితే యిలా చేస్తారా?" అంది వుక్రోషంతో కన్నీరు కారుస్తూ.

"మీవాళ్లయితే ఏం, నావాళ్ళయితే ఏం, బ్రహ్మదేవుడయితే ఏం! నా ఆత్మగౌరవానికి భిన్నంగా నేనుప్రవర్తించను అంతే" అన్నాడు సుబ్రహ్మణ్యం రోడ్డు మీదికి నడుస్తూ.

*　　*　　*

అయిదు సంవత్సరాలు గడిచినయ్. ఇప్పుడు సుబ్రహ్మణ్యం యిద్దరు బిడ్డల తండ్రి. భార్యకి మళ్ళీ ప్రసవించే రోజులు దగ్గరబడ్డయ్. ఇంట్లో చోటు లేదు. హాస్పిటల్లో జాయిన్ చెయ్యాలి. చేతిలో చిల్లిగవ్వలేదు. జీతం నూట ఎనభై. 20-వ తారీఖుకల్లా హారతి కర్పూరంలా హరించిపోయింది. పెద్ద పిల్లవాడికి జ్వరం తీవ్రంగా కాస్తున్నది. డాక్టర్ని పిలవాలంటే ముందుగా ఆయన విజిటింగ్ఛార్జీ 5 రూ. ఇవ్వాలి. చేతిలో ఐదురూపాయలు గాదు, ఐదు అణాలుకూడా లేవు. ఆరోజే భార్యకి నొప్పులువచ్చే సూచనలు కానవస్తున్నయ్. ఏమీ పాలుపోవడంలేదు. ఎవరిని అప్పు అడగాలి? అదివరకే చిల్లర మల్లర కలిసి అయిదు వందలదాకా వున్నయ్. మళ్ళీ ఎవరిస్తారూ? తల మీద రెండుచేతులూ అన్చి కుర్చీలో కూలబడ్డాడు కాలేజీ లెక్చరర్ సుబ్రహ్మణ్యం, ఏమీ దిక్కుతోచక. ఇంతలో వాకిలిముందు బండి ఆగింది. సుబ్రహ్మణ్యం పినతండ్రికొడుకు మోహన్రావూ, మరొక అపరిచిత వ్యక్తీ బండి దిగి సరాసరి లోనికొచ్చారు. కాసేపు మంచీ-చెడ్డా మాట్లాడిన తరువాత మోహన్రావు అన్నగారిని చాటుకు పిలిచి చెప్పాడు, "అతను మా స్నేహితుడికి దగ్గరచుట్టమేలే! మొన్ననే బి. ఏ. కి appear అయాడు. అన్నీ బాగానే వ్రాశాట్ట. గాని షేక్స్పియర్ లోనే కొంచెం డౌట్గావుందట. పేపర్లు నీదగ్గర కొచ్చినయ్యాని చెప్పారు. నీవెలాగైనా నాలుగు మార్కులు add చెయ్యాలి." ఈసారి సుబ్రహ్మణ్యం అదివరకులాగా నువ్విదితప్ప యింకేమి చెప్పినా చేస్తారా అన్లేదు. సరే నన్నాడు అర్థోక్తిలో. 'రెండువందలకన్నా ఎక్కువ యిచ్చుకోలేడట' అన్నాడు మోహన్. 'సరేలే' అన్నాడు దానికికూడ. డబ్బుమాట వినగానే ముఖం అదోమాదిరిగా పెట్టలేదు. దెబ్బతిన్న లేడిలా వులిక్కిపడనూలేదు. ఒకవిధమైన ఆనందం కనిపించింది అతనిముఖంలో. చెయ్యాలిసినపని చేసాడు. రెండు పచ్చ కాగితాలు వచ్చినయ్ చేతులోకి. భార్యని హాస్పిటల్లో జాయిన్ చేయించాడు. 5 రూ. విజిటింగ్ ఛార్జి యిచ్చి డాక్టర్ని పిలిపించి కొడుకుకి మందిప్పించాడు.

"మా పినతండ్రి మీతమ్ముడి అంత మాత్రం పట్టలేదు గాబోలు. ఎట్లాగైనా మీవాళ్ళుగదటండీ" అన్నది శారద ఐదులుతీర్చుకుంటూ.

# ప్రణయాలాపన

రచన: "రమణ్"

*

కోయిలకంఠా! రావేలా!
నీకై వేచితి జాగేలా!

ప్రేమసముద్రపు తరంగాలపై
నామది నీమది తేల్చియాడుచూ
ప్రణయనావలో పయనిద్దామె!
మనజీవితమె పాడిద్దామె ||కోయిల||

స్వర్గసీమలో విహరిద్దామె!
ప్రణయవారధిని నిర్మిద్దామె!
ప్రేమతోటలో శయనిద్దామె!
జాగుసేయక నె రావేమే!
నాగతి నీవని నమ్మితినే ||కోయిల||

తుమ్మెదజంటల ఝుమ్మనిధ్వనిలో...
కమ్మగపాడే, కోయిలపాటలో...
ఇమ్మగనుందామే! నాసఖి
రమ్మికపోదామే!! ఓసఖి ||కోయిల||

